సాక్షి చిత్తూరు

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



పంటలపై ఏనుగుల దాడులు
చౌడేపల్లె మండలం చుక్కావారిపల్లెలో పంట పొలాలను తొక్కి నాశనం చేశాయి.
- 8లో



ధర్మరాజుల తిరునాళ్లకు వేళాయే
పుత్తూరులోని శ్రీధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ధ్వజారోహణం జరుగనుంది.
- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	26
తిరుపతి	36	27
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

ఏఎన్‌ఎం కోర్సుకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఏఎన్‌ఎం ఫిమేల్) కోర్సుకు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ రీటా తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ శిక్షణ కాలం రెండేళ్ల పాటు ఉంటుదన్నారు. ఇంటర్మీ డియెట్ పూర్తి చేసి..17 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారికి చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని శిక్షణ కేంద్రంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని వసతులను ఉచితంగా కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు సెప్టెంబర్ 30వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రంలో సమర్పించాలని తెలిపారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు.

కొత్తగా 53 లెప్రసీ కేసులు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం నెల రోజుల పాటు చేపట్టిన ఎల్‌సీడీసీ సర్వేలో కొత్తగా 53 లెప్రసీ కేసులను గుర్తిం చినట్లు జిల్లా క్షయ నివారణాధికారి వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని టీబీ నివారణ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై 25వ తేదీ వరకు ఎల్‌సీడీసీ సర్వేను చేపట్టమన్నారు. ఏఎస్‌ఎంలు, ఆశవర్కర్లు జిల్లాలో 19,10,155 మందిని సర్వే చేశారన్నారు. ఇందులో అనుమానిత కేసులుగా 2,871 మందిని గుర్తించారని తెలిపారు. వీరందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తే..53 మందికి లెప్రసీ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. వీరికి చికిత్స కూడా ప్రారంభించామన్నారు. జిల్లాలో పాతకేసులు 116, కొత్తగా 53 కేసులు ఉన్నాయని, లెప్రసీ నివారణకు ఎప్పటికప్పు డు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

సెలవులో జిల్లా రిజిస్ట్రార్

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వ్యక్తిగత కారణాలతో 20 రోజులు సెలవుపై వెళ్లారు. గురువారం నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు సెలవు మంజూరు చేస్తూ ఆశాఖ కమిషనర్ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధులకు హాజరయ్యే వరకు ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ ఉషారాణి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

నేతమ్స్ షుగర్స్‌కు నోటీసులు


తహసీల్దార్ అమరేంద్రబాబు

నిండ్ర: మండలంలోని నేత మ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజ మాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ అమరేంద్రబాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం 2019–20 సంవత్సరంలో రైతుల నుంచి చెరకు సరఫరా చేసుకుని, రూ.36 కోట్లు బకాయిలు పడిందని తెలిపారు. అదేవిధంగా ముంబయికి చెందిన ఫైనాన్స్ కంపెనీకి సైతం రూ.63.19 కోట్లు బకాయి ఉందని పేర్కొన్నారు. దీనిపై ఫైనాన్స్ కంపెనీ కోర్టులో కేసు వేసిందని తెలిపారు. బకాయిలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని, లేకుంటే కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్తులు జప్తు చేస్తామని ఆయన తెలిపారు.

వార్డు సభ్యుల ఎన్నికలు రేపు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న 7 వార్డు స్థానాల ఎంపికకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జీడీనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ స్థానానికి ఇద్దరు, శాంతిపురం మండలం కడపల్లె స్థానానికి ఇద్దరు, మఠం స్థానానికి ఇద్దరు, వి.కోట మండలం కొంగాటం స్థానానికి ఇద్దరు, ఐరాల మండలం కాణిపాకం స్థానానికి ఇద్దరు, గు డుపల్లె మండలం పెద్దబదనపల్లె స్థానానికి ఇద్దరు, యాదమరి మండలం కాశిరాళ్ల స్థానా నికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి,తదుపరి ఫలితాలను ప్రకటించనున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు.

పరిశ్రమల భూముల పరిశీలన

విజయపురం (నగరి): పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి విజయపురం మండలం కోసల నగరంలో ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూములను జిల్లా కలెక్టర్ నగిలి షణ్మోహన్ గురువారం పరిశీలించారు. ఎంతమేరకు పరిశ్రమలకు సంబంధించి భూములను కేటాయించారనే విషయమై తహసీల్దార్ వెంకట్రాయులుతో చర్చించారు. ప్రస్తుతం పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. నగరి ఆర్డీఓ సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.

పోషకాల మెనూ.. నాణ్యతతో తిను!



మూడు పూటలా నాణ్యమైన భోజనం

అనారోగ్యంతో కొన్ని రోజులుగా చిత్తూరు పెద్దాస్పత్రి ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్నాను. మూడు పూటలా నాణ్యమైన భోజనాన్ని వడ్డిస్తున్నారు. ఆ వడ్డించే అన్నం ఇద్దరికి సరిపోతోంది. సమయానికి అన్నీ వడ్డిస్తున్నారు. గతంలో ఆస్పత్రి అంటేనే భయపడేవాళ్లం. రోగి ఆస్పత్రిలో ఉంటే సహాయకులు హోటళ్ల చుట్టూ తిరిగేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెద్దపెద్ద హోటళ్లలో మాదిరిగా అన్ని రకాలు వడ్డిస్తున్నారు.

-సుధాకర్, చిత్తూరు





ఇంట్లో కూడా ఇన్ని వంటకాలు ఉండవు

రెండు రోజులుగా చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా. టైంకు భోజనం ఇక్కడే వడ్డిస్తున్నారు. భోజనానికి ఇక్కడ లోటు రాలేదు. నాతో పాటు ఉన్న వ్యక్తికి కూడా నాకిచ్చే భోజనమే సరిపోతుంది. అందరికీ మెనూ ప్రకారం వడ్డిస్తున్నారు. మూడు పూటలా ఇంట్లో కూడా సాధ్యం కాని విధంగా కర్రీ, గుడ్లు, రకరకాల టిఫిన్లు పెడుతున్నారు. నాలాంటి పేదోళ్లు చాలా మంది ఇక్కడ వడ్డించిన వంటకాలతోనే సర్దుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

-గణేష్, చిత్తూరు

గతంలో ఇలా..

ఉడికీ ఉడకని అన్నం. చాలీచాలని నీళ్ల సాంబారు. పులిసిపోయి..పాచి వాసన వచ్చే కర్రీ. అదీ ఎప్పుడు పెడతారో.. రోగికి ఎప్పుడు వడ్డిస్తారో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో సహాయకులు ఆస్పత్రిలో పేషెంట్‌ని వదిలి హోటళ్ల చుట్టూ తిరిగేవాళ్లు. అధిక ధరలు వెచ్చించి ఆహార పదార్థాలు కొనుగోలు చేసేవారు. ఆస్పత్రుల ఖర్చులకు తోడు సహాయకుల తిండి ఖర్చు తడిసి మోపెడయ్యేది. అందుకే చాలామంది జబ్బు నయంగాకనే ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యేవారు. ఇచ్చే అరకొర సొమ్ముతో రోగులకు సరిపడా తిండిపెట్టలేక సంబంధిత కాంట్రాక్టర్లు తలలు పట్టుకునేవారు.

ఇప్పుడు ఇలా..



నాణ్యమైన వేడివేడి భోజనం. రుచికరమైన కూరలు. జబ్బును బట్టి రోగికి హైప్రొటీన్ వంటకాలు. డ్రైఫ్రూట్స్. పండ్లు. పాలు, రాగిజావ.. చపాతీ.. గుడ్డు.. చిక్కీలు.. అబ్బో..! ఒక్కటా రెండా.. స్టార్ హోటల్లో మాదిరిగా రోగికి సకల వంటకాలు అందిస్తున్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు.ఆస్పత్రిలో రోగి ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులూ పోషకాలతో కూడిన వంటకాలు వడ్డిస్తున్నారు. ఇందులోనే రోగుల సహాయకులూ సర్దుకుంటున్నారు. డైట్ చార్జీలు పెంచడంతో కాంట్రాక్టర్లు సైతం ఉత్సాహంగా పనిచేస్తున్నారు. వైద్యాధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ నాణ్యమైన డైట్ అందించేలా చర్యలు చేపడుతున్నారు.

- ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ డైట్
- వ్యాధులను బట్టి రోగులకు ప్రత్యేక పోషకాహారం
- డైట్ రెట్టింపు
- గతంలో ఒకరికి రూ.36, ప్రస్తుతం రూ.72కి పెంపు
- గర్భిణులకు రూ.100
- సీఎం వైఎస్.జగన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల డైట్ మెనూ ధరలు

గత ప్రభుత్వ హయాంలో
రోగికి రోజుకు మూడు పూటలా రూ.36
బ్రేక్ ఫాస్ట్:– బ్రెడ్, మిల్క్
లంచ్:– రైస్, సాంబార్, కర్రీ, ఎగ్–1, అరటిపండు, మజ్జిగ
రాత్రి భోజనం:–రైస్, సాంబారు, కర్రీ, మజ్జిగ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డైట్ మెనూ ధరలు
రోగికి రోజుకు మూడు పూటలా రూ.72
ఉదయం బ్రేక్ ఫాస్ట్:–
ఉప్మా, కిచిడీ, ఇడ్లీ, పొంగలి, ఎగ్–1
మధ్యాహ్న భోజనం:–
రైస్, సాంబారు, ఆకుకూర పప్పు, అరటి పండు, కర్రీ, మజ్జిగ, సంగటి (డయాబెటిక్), ఎగ్–1
రాత్రి భోజనం:–
రైస్, సాంబారు, టమోటా పప్పు, కర్రీ, సంగటి (డయాబెటిక్), అరటిపండు, మజ్జిగ, డ్రైఫ్రూట్స్, చపాతి(డయాబెటిక్), ఎగ్–1
గర్భిణులకు స్పెషల్
గర్భిణులకు రోజుకు రూ.100
పై మెనూతో పాటు అధనంగా చిక్కీలు, రాగి జావా అందిస్తున్నారు. అలాగే టీబీ, ఎయిడ్స్, మానసిక రోగులకు హై ప్రోటీన్ డైట్‌ను అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

తిరుపతి రుయాలో ఓపీ సేవలు	
ఓపీ సేవలు	1,200 - 1,400
అడ్మిషన్లు	150 -170
మెటర్నరీ ఆస్పత్రి ఓపీ	270 - 300
అడ్మిషన్లు	120 - 150

చిత్తూరు జిల్లాలోని ఆస్పత్రులు	
జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
సీహెచ్‌సీలు	7
రోజువారీ ఓపీ	1,500
ఇన్‌పేషెంట్లు	600



చిత్తూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రోగులకు కార్పొరేట్ తరహాలో మెనూ అందిస్తోంది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి వెచ్చించిన విధంగానే రోగులకూ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. రాయలసీమ పెద్దాస్పత్రిగా పేరుగాంచిన రుయాతో పాటు, జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో గడచిన మూడు నెలలుగా స్పెషల్ డైట్ విధానం అమలుచేస్తోంది.

నాణ్యతే లక్ష్యం

ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీ నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ అమలవుతోంది. గతంలో బ్రేక్ ఫాస్ట్‌లో పాలు, బ్రెడ్‌తోనే రోగులు ఆకలి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్రెడ్‌ను తొలగించి రోజుకొక టిఫిన్ వడ్డిస్తున్నారు. గతంలో మూడు పూటలకు కలిపి ఒక గుడ్డు ఇచ్చేవారు. ప్రస్తుతం రోగికి మూడు పూటలా గుడ్లు అందిస్తున్నారు. గర్భిణులకు అదనంగా చిక్కీలు, రాగి మాల్ట్‌ను డైట్‌లో చేర్చారు. టీబీ, ఎయిడ్స్, మానసిక వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు హైప్రొటీన్ డైట్‌ను వడ్డిస్తున్నారు.



పక్కాగా అమలు చేస్తున్నాం..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దిశగానే కొత్త డైట్ మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. మూడు పూటలా ఎగ్, కర్రీ వంటివాటిని అదనంగా వడ్డిస్తున్నాం. తద్వారా వ్యాధినిరోధక శక్తి పెరిగి రోగం త్వరితగతిన నయమవుతుంది.

-డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి,చిత్తూరు



రోగులకు పౌష్టికాహారం

జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో రోగులకు పటిష్టంగా పౌష్టికాహారాన్ని మూడు పూటలా అమలు చేస్తున్నాం. గతంలోకంటే మెనూ రేట్లను పెంచడంతో మంచి ఆహారాన్ని అందించేందుకు వీలుపడుతోంది. మెనూ అమలును అధికారుల పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు.

- డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి,చిత్తూరు

సీఎం నగరి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 28న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 'విద్యాదీవెన' పంపిణీ
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

నగరి : నగరిలో ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉదయం నగరి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నగరి, కుప్పం ఆర్డీఓలు సుజన, శివయ్యతో కలసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన పంపిణీ కార్యక్రమానికి విచ్చేయనున్నారని, అన్ని శాఖల అధికారులు సమన్వయంగా కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. ఆయా శాఖాధికారులు బాధ్యతతో ఎటువంటి పొరబాట్లకు తావు లేకుండా విజయవంతం చేయాలని తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ కిరణ్మయి, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలు తులసి, రాధమ్మ, గంగాభవాని, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీలు రబ్బానీ బాషా, డాక్టర్ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష పీవో వెంకట రమణారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, డీటీసీ నిరంజన్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణా రెడ్డి, డీపీఓ లక్ష్మి, సమాచార శాఖ ఇన్‌చార్జి డీడీ పద్మజ, ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి నరసింహులు, డీఎల్‌డీఓ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామి రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సభ, హెలీప్యాడ్ స్థలాల పరిశీలన


సభ నిర్వహణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త రఘురాం, కలెక్టర్, జేసీ,ఎస్పీ

ముఖ్యమంత్రి ఈనెల 28వ తేదీన జగనన్న విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు నగరికి విచ్చేయనున్న నేపథ్యంలో బహిరంగ సభ, హెలిప్యాడ్, ఏర్పాటు చేయనున్న ప్రదేశాలను ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశీల రఘురాంతో కలిసి జిల్లా కలెక్టర్ సంగిలి షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం పరిశీలిం చారు. ప్రధాన రహ దారి నుంచి సభా స్థలానికి వెళ్లే రహదారి, సభాప్రాంగణం, వాహనాల పార్కింగ్, రోడ్‌షో ఏ మార్గం గుండా రావాలనే అంశాలపై తలసిల రఘురాం అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- సమష్టిగా పనిచేసి లక్ష్యాన్ని అధిగమించాలి
- ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలోనే జిల్లా ఫస్ట్
- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ భవనంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇల్లులేని వారందరికీ గృహ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేసి లక్ష్యాన్ని అధిక మించాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉందని, దీన్ని అదే తరహాలోనే కొనసాగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిని పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని పేర్కొన్నారు. 25 ఇళ్లు, ఆపై ఉన్న జగనన్న కాలనీలకు ఆర్చ్‌ల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలన్నారు. అప్రోచ్ రోడ్ల విషయంలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని తెలిపారు. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, డోర్లు, లోగో ఉండాలన్నారు. గృహాలకు విద్యుద్దీకరణ పనులు, ప్రతి ఇంటికి ఒక లైటు ఉచితంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణ సముదాయంలో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు.

38 వేల గృహ నిర్మాణాలు పూర్తి

గృహనిర్మాణ శాఖ పీడీ పద్మనాభం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 38 వేల గృహ నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 2 వేల గృహాల నిర్మాణాలు మరో రెండు వారాల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. త్వరితగతిన గృహప్రవేశాలకు సిద్ధం చేస్తామని తెలిపారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో 458 కాలనీలకు గాను ఇప్పటికే 335 కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన కాలనీల్లో కూడా పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా ఏపీడీ వాణి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో మంత్రి, జెడ్పీ చైర్మన్


శబరిమలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

చిత్తూరు కార్పొరేషన్: అయ్యప్ప దీక్ష చేపట్టిన మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ గురువారం శబరిమలకు చేరుకున్నారు. పంపా నుంచి నడక మార్గం ద్వారా శబరిమలకు చేరుకుని దీక్ష విరమించి, అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. వారితో పాటు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పుంగనూరు: తమను రెగ్యులరైజ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్థానిక బసవరాజ కళాశాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ చిత్రపటాలకు కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం పాలాభిషేకం చేశారు. తమ కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని తెలిపారు.

సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు రావాలి


మాట్లాడుతున్న జిల్లా సైన్సు అధికారి రమణ

పలమనేరు: నిత్య జీవితంలో మనిషికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ప్రయోగాలను విద్యార్థి దశనుంచే ఆలోచించేందుకు ఇన్‌స్పైర్ మంచి వేదికని జిల్లా సైన్సు అధికారి రమణ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ గైడ్ టీచర్ల సమావేశం జరిగింది. సమాజానికి మేలు చేసే ఆలోచనలను విద్యార్థుల మదిలో నింపి అలాంటి ప్రయోగాలు ఆవిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రయత్నం చేయాలని తెలిపారు. ప్రతి హైస్కూల్ నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాలనుంచి మూడు నామినేషన్లను ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని తెలిపారు. మన జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు గైడ్ టీచర్లు కృషి చేయాలని పేర్కొన్నారు. డీవైఈవో విజయేంద్రరావు, ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, పాల్గొన్నారు.

ఇంతకీ ఆ తల్లి ఎవరు..?

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన ఓ తల్లి పసికందు(ఆడబిడ్డ)ను ఎందుకు బాత్‌రూంలో పడేసి పరారైంది..? 19 ఏళ్ల యువతి అంటున్నారు..బాత్‌రూంలో ఆమె ఎలా ప్రసవం చూసుకుంది.? ఆమెతో పాటు ఇద్దరు వ్యక్తులు వచ్చారంటున్నారు.. ఇంతకీ వాళ్లెవరూ..? ఇలాంటి సందేహాలెన్నో. ఆస్పత్రి అధికారులు మాత్రం విచారణ విషయంలో అలసత్వం వహిస్తున్నారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బుధవారం వేకువజామున కడుపునొప్పి అంటూ ఓ గర్భిణి ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయించిన విషయం విదితమే. ఇంతలో పురిటినొప్పులు అధికమై బాత్‌రూంలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చి అక్కడే వదిలేసి పరారైంది. ఆస్పత్రి సిబ్బంది ఎస్‌ఎన్‌సీయూ డాక్టర్లకు బిడ్డను అప్పగించారు. ప్రస్తుతం ఆ బిడ్డకు ఎస్‌ఎన్‌సీయూలోనే చికిత్స అందిస్తున్నారు. బిడ్డకు తల్లి ఎవరనే విషయాన్ని అధికారులు తేల్చలేకున్నారు. అడుగడుగునా సీసీ కెమెరాలు ఉన్నా ఫుటేజీల పరిశీలనలో వెనకడుగు వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు రోజులు కావొస్తున్నా విచారణలో అధికారులు మీనమేషాలు వేస్తున్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పోలీసులను ఆశ్రయించాం. శుక్రవారం విచారణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మార్గదర్శిలో సీఐడీ సోదాలు



చిత్తూరులోని మార్గదర్శి కార్యాలయంలో సీఐడీ అధికారుల తనిఖీలు

చిత్తూరు అర్బన్/తిరుపతి క్రైం: చిత్తూరు, తిరుపతి నగరాల్లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గురువారం సీఐడీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. చిత్తూరులో సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో సీఐడీ బృందం ఇక్కడి కార్యాలయంలో పలు ఫైళ్లను పరిశీలించింది. మార్గదర్శిలో ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తున్నారని, చీటీల నిర్వహణలో రిజిస్ట్రేషన్ శాఖ ఇచ్చిన మార్గదర్శకాలు పాటించడం లాంటి అంశాలను పోలీసులు పరిశీలించారు. ఈ సోదాలు కొనసాగుతాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

తిరుపతిలో..

తిరుపతి భవానీ నగర్ సర్కిల్‌లోని మార్గదర్శి చిట్ ఫండ్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగం, సీఐడీ అధికారులు గురువారం దాడులు చేశారు. మార్గదర్శి సహా పలు చిట్ ఫండ్ కంపెనీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో తీవ్ర అక్రమాలు, ఉల్లంఘనలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 2021-22 మధ్య చిట్స్ మొత్తాలను మళ్లించినట్టు, ముందస్తు పద్ధతిలో డబ్బులు వసూలు చేసినట్టు అధికారులు గుర్తించారు.

ధర్మరాజు తిరునాళ్లకు వేళాయే..

పుత్తూరు శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడి బ్రహ్మోత్సవాలు మహాభారతానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఏటా శ్రావణమాసంలో జరిగే ఇక్కడి బ్రహ్మోత్సవాలు పుత్తూరు తిరునాళ్లుగా ప్రసిద్ధికెక్కాయి. 18 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే తిరునాళ్లలో అర్జున తపస్సు, రథోత్సవం, అగ్నిగుండ ప్రవేశం తలమాణికం. శుక్రవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు శతాబ్దాలుగా ఇక్కడ జరిగే జరుగుతున్న అగ్నిగుండ ప్రవేశం అమ్మవారి సత్యశీలతకు నిలువెత్తు నిదర్శనంగా భక్తులు విశ్వసిస్తారు.

- మహా భారత ఉత్సవాలకు నేడు ధ్వజారోహణం
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రథం కలిగిన ఆలయం
- అర్జున తపస్సు, రథోత్సవం, అగ్నిగుండం ప్రధాన ఘట్టాలు
- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తుల రాక



పుత్తూరు ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం



అర్జున తపస్సుమాను వద్ద వరపడిన భక్తులు (ఫైల్)



అమ్మవారి సత్యశీలతకు నిదర్శనం అగ్నిగుండ ప్రవేశం (ఫైల్)



భక్తజన సందోహంతో రథోత్సవం (ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈమేరకు విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోనే ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలు ప్రత్యేకం. ఈనెల 25న వరలక్ష్మీవ్రతం రోజున అర్జున తపస్సు జరుగనుంది. ఆరోజు మధ్యాహ్నం అర్జున తపస్సు, సాయంత్రం ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బందిచే అమ్మవారి ఊరేగింపును పురస్కరించుకుని పెద్దఎత్తున బాణసంచా కాలుస్తారు. అనంతరం పాటకచేరి, రాత్రి 11 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 26న రథోత్సవం జరుగనుంది. కౌరవుల వధ అనంతరం పాండవులు విజయోత్సవంతో రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగడమే రథోత్సవ ఘట్టం. దక్షిణ భారత దేశంలోని ధర్మరాజుల స్వామి ఆలయాల్లో ఎక్కడా లేనివిధంగా 45 అడుగుల చుట్టు కొలత, 40 అడుగుల ఎత్తు కలిగిన భారీరథం ఇక్కడి ప్రత్యేకత. ఈ భారీ రథాన్ని పాండవులు అధిరోహించి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతారు. వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు. ఈనెల 27న అగ్నిగుండ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు వేలాదిమంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేస్తారు.

ఆలయ ప్రాశస్త్యం..

లభించిన ఆధారాల మేరకు విజయనగర సామ్రాజ్యం 17వ శతాబ్దంలో పతనం కావడంతో దక్షిణ భారతదేశంలో ఔరంగజేబు సైన్యం విజృంభిస్తుంది. వీరికి ఆర్కాడు నవాబు తోడు కావడంతో తమిళనాడులోని చెంగల్పట్టు ప్రాంతానికి చెందిన వారు పుత్తూరుకు వలస వస్తారు. అలా వలస వచ్చిన వారిలో ఏడుగురు అన్నదమ్ములు ఉన్నారు. వీరు పొట్టకూటి కోసం పుత్తూరు సమీపంలోని చౌటూరు గ్రామంలో ఓ బావిని తవ్వే పనికి పూనుకుంటారు. తవ్వకాల్లో వీరికి చెక్కతో తయారు చేసిన అమ్మవారి విగ్రహం దొరుకుతుంది. అన్నదమ్ములు అమ్మవారి విగ్రహానికి పూజలు ప్రారంభిస్తారు. అన్నదమ్ముల్లో చిన్నవాడు ఆలయం కట్టాలని సంకల్పించి, అమ్మ విగ్రహాన్ని బుట్టలో పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతూ, కత్తితో శరీరంపై బాదుకుంటూ విరాళాల సేకరణ ప్రారంభిస్తాడు. విషయం తెలుసుకున్న కార్వేటినగరాన్ని పాలిస్తున్న సాల్వరాజు విరాళాలు సేకరిస్తున్న వ్యక్తి చేతికి మరోకత్తిని ఇచ్చి బాదుకోమని పరీక్షిస్తాడు. పరీక్షలో నెగ్గిన ఆ వ్యక్తికి ఏమి కావాలో కోరుకోమంటాడు. దీంతో ఆ వ్యక్తి పుత్తూరులో అమ్మవారికి ఆలయం నిర్మించాలని కోరుతాడు. వైష్ణవ భక్తుడైన సాల్వరాజు ఆలయాన్ని నిర్మించి ఇస్తాడు. గ్రామస్తులు విరాళాలు పోగు చేసి 40 అడుగుల రథాన్ని ఏర్పాటు చేస్తారు అప్పటి నుంచి పుత్తూరులో శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. భారతంలోని 18 పర్వాలకు అనుగుణంగా ఈ ఉత్సవాలను 18 రోజుల పాటు నిర్వహిస్తారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

మోహిత్‌కు వేద పండితుల ఆశీర్వాదం



మోహిత్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న తిరుపతి రూరల్ ఎంపీపీ, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గురువారం పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా తిరుచానూరు యోగిమల్లవరంలో వెలసిన శ్రీకామాక్షి సమేత పరాశరేశ్వర స్వామివారి ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్, మోహిత్‌ను సత్కరించి స్వామి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

25న కాణిపాకం పాలకమండలి సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం పాలక మండలి సమావేశం ఈనెల 25న తేదీన నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు ఆలయ ఈఓ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ఆలయ అధికారులందరు హాజరు కావాలని పేర్కొన్నారు.

నిధుల కేటాయింపుపై విశ్వకర్మల హర్షం

చిత్తూరు రూరల్: కులవృత్తిదారులను ఆదుకునేందుకు విశ్వకర్మ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం 13 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని విశ్వకర్మ కౌశల యోజన జిల్లా కన్వీనర్ దయానంద ఆచారి అన్నారు. చిత్తూరు నగరంలోని విశ్వకర్మ సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులు 18 రకాల సంప్రదాయ వృత్తులకు వారికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కో కన్వీనర్ శరవణ ఆచారి పాల్గొన్నారు.

2,800 అడుగుల ఎత్తైన కొండపై జాతీయ పతాకం రెపరెపలు



కొండ శిఖరంపై రెపరెపలాడుతున్న జెండా, పక్కనే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

నగరి : భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు, నా మట్టి.. నా దేశం కార్యక్రమాలు సచివాలయ సిబ్బందిలో స్ఫూర్తి నింపాయి. ఈ క్రమంలోనే ప్రతి ఇంటిపైనా జెండా ఎగురవేయాలని ప్రభుత్వం పిలుపునివ్వడంతో జాతీయ పతాకం విశిష్టతను తమకు వీలైనంత గొప్పగా ప్రజలకు చెప్పాలనుకున్నారు. నారాయణవనం, నగరి కశింమిట్ట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈశ్వరయాదవ్, సతీష్‌కుమార్ నగరి పట్టణ శివార్లలో 2,800 అడుగుల ఎత్తైన ముక్కుకొండ ఎక్కాలని నిర్ణయించుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు సాయంత్రం గైడ్ సాయంతో ట్రెక్కింగ్ ప్రారంభించారు. గురువారం ఉదయం కొండ శిఖరంపై గగన వినాయకునికి పూజలు చేసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్య్ర సమరయోధులకు వినూత్నంగా నివాళులర్పించారు.

అంతర్రాష్ట్ర మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్

26 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శాంతిపురం: ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 26 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పలమనేరు డీఎస్పీ ఎస్. సుధాకర్‌రెడ్డి రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. బడుగుమాకులపల్లె సంతలో గత ఆదివారం బుల్లెట్ వాహనం దొంగతనానికి గురైంది. బాధితుడు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తరచూ బైకుల చోరీలు జరుగుతుండడంతో డీఎస్పీ ఆదేశాలతో కుప్పం రూరల్ సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్‌ఐలు మునిస్వామి, లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. విచారణలో రాళ్లబూదుగూరుకు చెందిన ఫరూక్(27), ఎస్ ప్రకాష్(26)ను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 26 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 40 లక్షలుగా లెక్కగట్టారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ, ఇద్దరు ఎస్‌ల బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్టు డీఎస్పీ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న అధికారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో ఎస్‌ఈబీ అధికారులు గురువారం చేపట్టిన తనిఖీల్లో రూ.50వేలు విలువ చేసే కర్ణాటక మద్యం పట్టుపడింది. జెడ్పీ కార్యాలయం ఎదుట తనిఖీ చేస్తున్న సమయంలో ఓ కారులో రూ.50 వేలు విలువ చేసే 960 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న మణికంఠన్ (39) అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో సీఐ జోగేంద్ర, సిబ్బంది ఎస్‌బాబు, రామ్‌ప్రసాద్, బాబు, వేణుగోపాల్‌రెడ్డి, జయశంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో యువకుడు దారుణ హత్య

- బండరాయితో కొట్టి చంపిన వైనం
- స్నేహితుడే నిందితుడు



హత్యకు గురైన గుర్తు తెలియని వ్యక్తి

పలమనేరు: పలమనేరు పట్టణ సమీపంలోని హైవేలో కోర్టుకు ఎదురుగా ఓ 25 ఏళ్ల యువకుడు గురువారం రాత్రి దారుణ హత్యకు గురైయ్యాడు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. కోర్టు ఎదురుగా యువకుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి చూడగా, 25 ఏళ్ల వయసున్న యువకుడి ముఖం గుర్తుపట్టని విధంగా మారిన మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. పట్టణ సమీపంలోని సిల్క్‌ఫామ్‌కు చెందిన మురళి(16) కొన్నాళ్లుగా బెంగళూరులో తాపీమేస్త్రీ పనులు చేస్తుండేవాడు. మూడు రోజుల కిందట ఇక్కడికి వచ్చాడు. హత్యకు గురైన స్నేహితుడితో కలసి కోర్టు సమీపంలోని ఓ రియల్ వెంచర్ వద్దకు వెళ్లి, ఇద్దరూ పూటుగా మద్యం సేవించారు. ఆపై ఇద్దరి మధ్య ఏం జరిగిందో మురళి కిరాతంగా బండరాయిని స్నేహితుడి తలపై మోది హతమార్చినట్లు సమాచారం. మృతిచెందిన వ్యక్తిది పెద్దపంజాణి మండలంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ హత్య ప్రేమ కారణంగా జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాల్సి ఉందని సీఐ తెలిపారు. ఈ హత్య పట్టణంలో కలకలం సృష్టించింది.

బాబు మాటలు నమ్మితే సెంట్రల్ జైలుకే

- వ్యూహం ప్రకారమే పోలీసులపై దాడి
- తెలుగుదేశం అరాచకాలను అడ్డుకుంటాం
- వైఎస్సార్ సీపీ నేతల స్పష్టం



మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, షరీఫ్

పుంగనూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మాటలు నమ్మి పోలీసులపై దాడులు చేసి, కడప సెంట్రల్ జైల్లో పార్టీ నాయకులు మగ్గుతున్నారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాయలసీమ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పుంగనూరు ప్రశాంతతకు మారు పేరుగా ఉందన్నారు. ఇక్కడ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చంద్రబాబునాయుడు తన అనుచరులతో పథకం వేసి పోలీసులపై దాడులు చేయించారని ఆరోపించారు. తెలుగుదేశం ఆగడాలను అడ్డుకుంటామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. షరీఫ్ మాట్లాడుతూ పుంగనూరు, కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం ఖాయమని మతిచలించి చంద్రబాబునాయుడు హింసా రాజకీయాలకు తెర తీశారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. చంద్రబాబు, అల్లరి మూకలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రతిఘటన పుంగనూరు నుంచి ప్రారంభమవుతుందని హెచ్చరించారు. అమ్ము మాట్లాడుతూ గొడవలు చేస్తే జైలుకు వెళ్తారే తప్ప ఓట్లు రావని పేర్కొన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు చంద్రబాబును ఇక నమ్మే పరిస్థితులో లేరని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లలిత, కౌన్సిలర్లు రేష్మా, సాజిదా, నరసింహులు, కాళిదాసు, భారతి, రాఘవ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయకృష్ణ, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, అహమ్మద్, అస్లాంమురాధి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబండ్లపై దూసుకొచ్చిన కారు



చెరువులో పడిన కారు





మృతి చెందిన తులసి, చికిత్స పొందుతున్న దొరస్వామి

- యువతి దుర్మరణం, మరో వ్యక్తికి గాయాలు
- కారు నడిపిన సోమల తహసీల్దార్?

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా కళాశాల వద్ద గురువారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండ్లపై కారు అతివేగంగా దూసుకొచ్చిన ప్రమాదంలో ఒక యువతి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మదర్‌థెరిసా కళాశాల వద్ద మండలంలోని మేలుమాయి గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి(46), సోమల మండలం రాంపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమార్తె తులసి(25) తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్నారు. సాయంత్రం మదనపల్లె వైపు నుంచి కారు వేగంగా వచ్చి తోపుడుబండ్లను ఢీకొని సమీపంలోని చెరువులోకి దూసుకు వెళ్లింది. ఊహించని ఈ ఘటనలో తులసి అక్కడికక్కడే మృతి చెందింది. దొరస్వామి రెడ్డికి తల,శరీర భాగాల్లో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

దహనక్రియలకు వెళ్లి వస్తుండగా..

ప్రమాదానికి కారణమైన కారు సోమల తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి చెందిందని, ఆయనే స్వయంగా కారు నడిపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆయన కుటుంబంతో కలిసి మదనపల్లెలో బంధువుల దహనక్రియల కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో కారులో ఉన్న ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ చుక్కావారిపల్లెలో గురువారం తెల్లవారుజామున ఏనుగులు పంట పొలాలపై విరుచుకుపడ్డాయి. గ్రామానికి సమీపంలోని గిరిరాజు, వెంకటరాజు,శ్రీధర్‌రాజు, వెంకటరెడ్డికి చెందిన టమాటా, వరి, దోస, రాగి పంటలను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. సుమారు రూ.5లక్షల మేరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. అటవీ శాఖాధికారులు నష్టం అంచనా వేసి పరిహారం అందివ్వాలని కోరారు. ఏనుగులు గ్రామానికి సమీపంలో మకాం వేసి ఉన్నాయని, పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు పదోన్నతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లాలో రామకుప్పం ఎస్‌ఐ వి.శ్రీనివాస్, నిత్యబాబు (పోలీసు శిక్షణా కేంద్రం), ఎం.మనోహర్ (చిత్తూరు ఎస్‌బీ), డి.గోపి (తిరుపతి అటాచ్) ఉన్నారు. తిరుపతి జిల్లాలో ఎం.తిమ్మయ్య (శ్రీకాళహస్తి), ఎస్.ప్రవీణ్‌కుమార్ (శ్రీసిటీ), ఎస్.హనుమంతప్ప (నాగలాపురం), ఎస్.వంశీధర్ (చంద్రగిరి), ఎం.మంజునాథరెడ్డి (బీఎన్.కండ్రిగ), ఆర్.వినోద్‌కుమార్ (తిరుపతి రూరల్), జి.ప్రకాష్‌కుమార్ (భాకరాపేట) ఉన్నారు. వీరు కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.